


# ఎవరి విలువ వారిది

సురా శర్మ

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

మాకాలనీలో మా ఇరుగు పొరుగునున్న కేప్టన్ సుంద్రరావు, డిప్యూటీ కలెక్టర్ ధర్మారావు, ఇంజనీరు మహేంద్రనాథ్, పోలీస్ ఇన్స్పెక్టర్ శాయినాథ్ మరియు కాంట్రాక్టరు కరీ సాహెబ్‌గార్లకు నేనంటే లోలోపల మంట. అందుకు కారణం - నేను ఏనాది ఎరుకలయ్యను మా ఆవరణలో కాస్తంత చోటిచ్చి ఓ కొట్టం వేసుకొని కాపురముండమన్నానని. మన మెంత మన డిగ్నిటీ ఎంత అన్నధోరణి లోనే వుంటారువారు.

ఎరుకలయ్య, అతడి భార్య మారెమ్మ కష్టజీవులు. వారికి యిద్దరు పిల్లలు కాగానే ఈ దేశ శ్రేయస్సుకోసం ఆపరేషన్ చేయించుకొన్న ఉత్తమ పౌరులనవచ్చు. అదే సుంద్రరావు, ధర్మారావు, మహేంద్రనాథ్, శాయినాథ్, కరీమ్ సాహెబ్‌గార్లు అందరికీ ఐదు, ఆరు, ఏడు సంఖ్యల్ని మించిన సంతానమే వుంది. మా విషయం అందుకు భిన్నం. మేమెన్ని గుళ్ళ గోపురాలకు మొక్కినా పిల్లలు కాలేదు. చిన్నప్పటించి మా వద్ద పెరిగిన మా అన్నయ్య కుమార్తె అన్నపూర్ణ మాత్రం మావద్దనే వుంటోంది ఆ లోటు తీరుస్తూ!

ఎరుకలయ్య దంపతులు మొదట్లో వేపల్ని యండ్రకాయల్ని పట్టి అమ్మేవారు. ఒక్కోరోజు అవి గిట్టుబాటు కాక పస్తులుండేవారు. అది చూసి నేను అతడికి బజారు పనులప్పగించాను. వంద కిలోల బియ్యపుబస్తాను అవలీలగా భుజాలకెత్తుకొని మండీల నుండి దుకాణాలకు మోస్తుంటాడతడు. బస్తాకు అర్ధరూపాయి చొప్పున యిరవై బస్తాల పైనే మోసేసి రోజుకి పది పన్నెండు రూపాయిల్ని కళ్ల చూసేలా చేశాను. మా ఆవిడ మాలతి మారెమ్మకు కొన్ని యిళ్ల పాచి పనులు అప్పగించింది. ఆవిడ సైతం నెలకు వంద రూపాయలు గిట్టించుకొంటుంది. ఎరికలయ్య కెలాంటి దుర్గుణాలు లేవు. బీడి కూడా ముట్టడతడు. ప్రొద్దునే సద్ది తాగేస్తారు వాళ్ళు. మధ్యాహ్న సాయంత్రాలు సంగటి రొట్టెలు ఇళ్లనుండి తెచ్చుకొన్న సాధకాలతో సరి పుచ్చుకొంటుంటారు. ప్రతి ఆదివారం రెండేసి మూడేసి సినిమాల్ని చూసేస్తుంటారు.

కేప్టన్ సుంద్రరావు బాడుగలు సంపాదించేందుకు హవేలీలు ఒకొక్కటే కట్టిస్తూండే మా

వీధిలోకి ఒక హవేలీలో రామ్‌లాల్ వచ్చి చేరాడు. అతడి భార్య ధనమ్మ. వారికిద్దరు పిల్లలు. వాళ్లు కాన్వెంటు చదువులు చదువుతున్నారు. ఎక్కడో ట్రంకు రోడ్డు మీద టీ బంకు పెట్టుకొన్న రామ్‌లాల్ బాగానే సంపాదిస్తుండే వాడు. అతడ్ని ఆ స్థల యజమాని ఖాళీ చెయ్యమనడంతో అతడిక్కడి కొచ్చి చేరి చేరువనున్న అప్సర థియేటర్ వద్ద పెట్టాడు. కానీ ట్రంకు రోడ్డు మీద వుండిన గిరాకీ యిక్కడ లేక పోయింది. నష్టాలు రా బట్టాయి. పిల్లలా? కాన్వెంటులో చదివే వారైరి. ఇక లాభం లేద నుకొని బొంబాయి హార్బర్‌లో పని చేసి నీకు డబ్బు పంపుతానని ఒకరాత్రి బొంబాయి మెయిలెక్కి వెళ్లి పోయాడు రామ్‌లాల్. ధనమ్మ పెద్ద జుట్టు విశాల నేత్రాలు, తెల్లటి తెలుపుతో బాగా నాజూకుగా అందంగా వుంటుంది. ఆమెను చూస్తే కష్టమంటే ఎలాంటిదో తెలియని మనిషిలా కన్పిస్తుంది. అయితే పిల్లల చదువులు ఆగిపోగూడదు కదా. అందుకుని ఇంట్లో చిన్న అంగడి పెట్టుకొన్నది. ఇంటి ముందు పెనం పెట్టి దోశలు వేస్తోంది. ఎలాగో తంటాలు పడుతోంది. వీధిలో అందర్నీ నవ్వుతో పలుకరిస్తూ మంచిగా వుంటోంది. మా ఆవిడను వొదినా అంటూ, నన్ను అన్నయ్య అంటూ తన కష్టసుఖాలు చెప్పుకొంటూంటుంది ధనమ్మ. ఆవిడను చూస్తే మా కాలనీలో మాకేగాక అందరికీ యిష్టమే. ఆదివారాలు అంతా కలుస్తుంటాము. కేప్టన్ సుందర్రావు తన మిలటరీ అనుభవాలు గొప్పగా చెప్పుకొంటుంటాడు. ఫ్రాంచ్ రంగంలో తను సేనలనెలా నడిపిందీ, టాంకులతో పాకిస్తాన్ సేనల్ని ఎలా దెబ్బ తీసిందీ పేము కుర్చీలో కూర్చొని పెద్దగా నవ్వుతూ మీసాలు మెలేస్తూ చెబుతుంటాడు. ముఖ్యంగా ధనమ్మ వినాలని అతడి ఆరాటం. డిప్యూటీ కలెక్టరు ధర్మారావు తన ఎదుట చేతులు కట్టుకునిల్చొన్న జవాన్లు గుమస్తాల ఎదురుగా అట్టహాసాలొలుక బోస్తూ గొప్పలు చెబుతుంటాడు. ఇంజనీరు మహేంద్రనాథ్ తన గొప్పలు తనూ చెబుతూనే వుంటాడు. ఇన్స్‌పెక్టర్ శాయినాథ్ తన గొప్పను తన ఎదురుగా శాల్యూట్ చేసి నిల్చొన్న ఆర్డర్లీలను, హెడ్డులను బండబూతులు తిడుతూ చాటుకొంటాడు. సరే ఇహ కంట్రాక్టర్ కరీమ్ సాహెబ్ తను రోడ్లు వేసే కంట్రాక్టు పనుల్ని ఎంతో నిజాయితీతో చేస్తుంటానని చెప్తాడు. అర ణ్యాలలో కొత్త రోడ్లు వేస్తున్నప్పుడు ఎదురయ్యే ప్రమాదాల్ని వింత వింత కథల్లా చెబుతుంటాడు. ఎన్నో క్రూరమృగాల్ని, రకరకాల పాముల్ని ఇట్టేపట్టి అట్టే చంపేస్తుండేవాడినని చెబుతుంటాడు. ఒకసారి ఒక పెద్ద కొండ శిలువ రోడ్డు కడ్డంగా పడుకొందట. దాన్ని అవతలకి తోలటానికి అక్కడి ఇంజనీర్లకు గానీ, మేస్త్రీలకుగానీ కూలీలకుగానీ దమ్ముల్లేక పోయాయట. అప్పుడు తను ఒక పెద్ద కట్టెతో దాన్ని ఎత్తి అవతలకి కుదేసే సరికి అది అల్లా మియా అంటూ పరుగెత్తి పోయిందిట. అతడు సైతం మహా పటాటోపంగా ధనమ్మకు విన బడేలా గడ్డం నివురుకొంటూ టోపి సర్దుకొంటూ చెప్పుకు పోతుంటాడు. నేను విద్యుచ్ఛక్తి శాఖలోని ఒక అనామక యు.డి.సి. క్లర్కుని. వారితో పోలిస్తే నేను నథింగ్ అనే చెప్పాలి. ఎటొచ్చీ వాళ్లు పై అంతస్తులవాళ్లు కాబట్టి వాళ్లేం చెబు తున్నా నవ్వుతూ మౌనంగా వినడం నా వంతు. ఆ రోజు ఆదివారమైనా నేను రైల్వే కోడూరు క్యాంపు వెళ్లాల్సి వచ్చి రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరగానే మా అన్నపూర్ణ ఉత్సాహం ఉరకలు వేస్తూ ఎదురొచ్చి "బాబాయ్! ఇవాళ ఒక అద్భుతవింత జరిగింది" అంది. "ఏందమ్మా అది" అన్నాను నేను నవ్వుతూ. మా ఆవిడ కూడా నవ్వుతూ వచ్చి---

"మన ధనమ్మ హవేలీ ప్రక్కన పునాది రాళ్ల గుట్ట లేదూ?" అంది.

"అవును వుందీ?" అన్నాను నేను. "ఆ రాళ్ల సందుల్లోంచి ఓ పాము కదలాడుతోంటే ధనమ్మ చూసి కెవ్వున కేకసి కేప్టన్ సుందర్రావుతో మొరపెట్టు కొంది. సుందర్రావు పెద్ద వీరుడిలా ఓ కట్టె తీసుకొచ్చి రాళ్లలోకి తొంగి చూసి "అమ్మో! అది నాగు పాము" అన్నాడు. ఇంతలో ధర్మారావు గారొచ్చి కళ్లద్దాల్లోంచి తేరిపార జూసి "అవునయ్యోయ్! బుసలు కూడా కొడుతూంది" అన్నాడు. సుందర్రావు నసుగుతూ-- "ఎందుకైనా మంచిది కంట్రాక్టరు కరీమ్‌నిలా పిలవ్వయ్యా, ఆయన ఎన్నో పాముల్ని కొండ శిలవల్నీ చంపేశా నంటుంటాడు కదా?" అన్నాడు. కరీమ్ సాహెబ్ లుంగీతో గడ్డం నివురు కొంటూ వచ్చి వొంగి దాన్ని గమనించి -- "ఇది నిజంగా నాగుపామే నండీ. కట్టెలతో కొడితే తప్పించుకు పారిపోయి మన పై పగబట్టి వరసగా అందర్నీ చంపెయ్యగలదు." అంటూ "సార్! ఇన్స్‌పెక్టర్ సాబ్! మీరు పిస్టల్ తీసుకొచ్చి దాన్ని ఒకే షాట్‌తో సఫా చెయ్యండి సాబ్" అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ శాయ్‌నాథ్ పిస్టల్ తోనే వొచ్చాడక్కడి. దాన్ని పరికించి చూశాడు. "చూడండీ! నేను పిస్టల్‌తో దాన్ని కాల్చగలను. నోడౌట్. కానీ అది నాగుపాము. మాకు నాగ ప్రతిష్ఠ వుంది. రండి రండి అందరూ దూరం వచ్చెయ్యండి. దానంతకదే వెళ్ళిపోతుంది" అనేశాడు.

అందుకు ధనమ్మ విలపించింది. "బాబూ! వొంటరి మనిషిని నాగతేంగాను!!" అప్పుడే నేను ధనమ్మ వెనక చేరి ధైర్యం చెప్పాను. అప్పుడే మేట్నీ కెళ్లి వచ్చిన ఏనాది ఎరికలయ్యకు చెప్పాను విషయం.

అతడు వెంటనే "పదండమ్మా" అంటూ చేతిలో ఏ ఆయుధం లేకుండానే వచ్చి పునాది రాయిని అవతలకి తోసి చూశాడు. పాము కదులుతోంది. ఎరికలయ్య అవలీలగా దాన్ని చేత్తో పట్టి గిరగిరా తిప్పి రాతికేసి కొట్టాడు. దాని తలపగిలి రక్తసిక్తమైంది. వెంటనే దాన్ని నేలమీద పడేశాడు. అది ఒకటి రెండు చావు మెలికలతో ప్రాణాలు విడిచింది. ధనమ్మ గొప్పవూరట పొందింది. అంతా సైలెంట్ స్పెక్టేటర్సులాగా నిల్చొన్నారు.

"నాయనా ఎరికలయ్యా! అదేం పాము?" అన్నాను నేను.

"అమ్మగారూ! అదొట్టి నీరు గట్టు పామండీ" అన్నాడతడు. తనపనైపోయినట్టు వెళ్లిపోతూ" అని ముగించింది మా ఆవిడ. ●

# స్వ-పర

నీ జేబు ఎవడైనా కొట్టేస్తే
దొంగతనాల మీద
గంటల తరబడి ఉపన్యాసం
నీ ప్రక్కవాడి జేబు కొట్టేస్తే
అది నీకు వాడి నిర్లక్ష్యం

—మోదు రాజేశ్వరరావు